

చవితి పూజకు సన్నద్ధం

వినాయక చవితి పర్వదినం సందర్భంగా వాడవాడలా పూజలందుకునేందుకు గణనాథుని విగ్రహాలు సిద్ధమయ్యాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ గణేష్ ప్రతిమలు తయారు చేసి విక్రయిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం 32/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు



సింగరాయకొండ: జిల్లాలోని ఉపాధ్యాయులకు బుధవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. యువతను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అటువంటి వారు ఎన్నటికీ పూజనీయులేనని కొనియాడారు.

గంజాయి కేసులో నిందితులు అరెస్ట్

పెద్దారవీడు: మండలంలో హనుమాన్ జంక్షన్ కుంట సమీపంలో గ్లోరి చర్చి వెనకాల ఖాళీ ప్రదేశంలో గంజాయి పంచుకుంటున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పీ అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్‌ఐ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలో హనుమాన్ జంక్షన్‌కుంట సమీపంలో గ్లోరి చర్చి వెనకాల ఖాళీ ప్రదేశంలో సోమవారం ఆరుగురు వ్యక్తులు రాజమండ్రి నుంచి తీసుకొచ్చిన గంజాయిని వివిధ ప్రాంతాల్లో అమ్ముకునేందుకు పంచుకున్నారు. పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి చూడగా ఆరుగురు వ్యక్తులు భాగాలు చేసుకొని పంచుకుంటున్న సమయంలో వారి వద్ద ఉన్న మొత్తం 39.515 కేజీలతో వారిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి జిల్లా గుండాల మండలం మసాన్‌వల్లి గ్రామానికి చెందిన బొంత రమేష్, నల్గొండ జిల్లా నార్కెట్ మండలం పల్లెపాడు గ్రామానికి చెందిన గొండ్యాల మహేష్‌యాదవ్ అలియాస్ మున్నాభాయ్, నల్గొండ పట్టణం బొట్టుగూడకు చెందిన మహ్మద్ జావేద్, బెంగళూరు పట్టణం ధానిరోడ్డు ఆనంద్ సినిమా హాల్ దగ్గర మహ్మద్ అనిస్, పల్నాడు జిల్లా వినుకొండ పట్టణం సీతయ్యనగర్‌కు చెందిన కలతోటి గోపి, పల్నాడు జిల్లా ఈపూరు మండలం బొగ్గారం గ్రామానికి చెందిన కొజ్జ గౌతం అకాష్‌లను అరెస్ట్ చేసి మంగళవారం మార్కాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను పోలీసులు ఒంగోలు జిల్లా జైలుకు తరలించారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా కులశేఖర్

ఒంగోలు టౌన్: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ ఆఫీసర్‌గా అడిషనల్ ఎస్పీ జె.కుల శేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న ఈశ్వరరావును హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది.

హవ్వ.. ఇదేమి చోద్యం



టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పక్కన మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు



సమీక్షకు హాజరైన మున్సిపల్, మలేరియా సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులు

- కార్పొరేషన్ ఆఫీసుగా టీడీపీ కార్యాలయం
- టీడీపీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన దామచర్ల
- సమీక్షలో సంబంధం లేని టీడీపీ నాయకులు హల్‌చల్
- ఏ పని చెప్పినా చేయాల్సిందేనంటూ అధికారులకు హుకుం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: హవ్వ...ఇదేమి చోద్యమో మరీ...గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉంది టీడీపీ ప్రజాప్రతినిధుల తీరు. టీడీపీ కార్యాలయం నగర పాలక సంస్థ కార్యాలయంగా మారిపోయింది. ఇక్కడ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది రావడం వారితో సమీక్ష నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. అధికారులు సైతం ఫైళ్లు పట్టుకుని మరీ వెళ్లడం చర్చనీయాంశమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాత గుంటూరు రోడ్డులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు చెందిన టీడీపీ కార్యాలయం ఉంది. ఇక్కడ ఆయన బుధవారం నగర పాలక సంస్థ అధికారులతో పాటు 50 వార్డు సచివాలయ కార్యదర్శులు, మెడికల్ అండ్ హెల్త్ మలేరియా విభాగం వారితో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో వైఎస్సార్ సీపీ తరఫున మేయర్‌గా గెలిచి ఇటీవలే టీడీపీ తీర్థం పుచ్చుకున్న మేయర్ సుజాత కీలకంగా వ్యవహరించారు. సమీక్షలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు కూడా పాల్గొన్నారు. అధికారులు, సిబ్బందితో సమీక్ష టీడీపీ కార్యాలయంలో ఏంటి సార్ అని అనలేని పరిస్థితిలో ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు ఉండడంతో పాటు.. జీ హుజూర్ అనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమీక్షలో ఎమ్మెల్యేతోపాటు పలువురు టీడీపీ నాయకులు కూడా పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేయడం గమనార్హం. అధికారులతో టీడీపీ కార్యాలయంలో సమీక్ష ఏర్పాటు చేయటం ఒక తప్పయితే... ఆ సమీక్షలో నగర పాలక సంస్థకు సంబంధంలేని టీడీపీ నాయకులు కూడా పాల్గొని టీడీపీ వాళ్లు ఏ పని చెబితే ఆ పనిచేయాల్సిందే అంటూ హుకుం జారీ చేయటం మరో తప్పు. ఎమ్మెల్యేగా గెలిచి నాలుగు నెలలు కావస్తున్నా ఇంత వరకు నగర పాలక సంస్థలో ఎక్స్ అఫీషియో మెంబరుగా కూడా ప్రమాణ స్వీకారం చేయని ఆయన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తుఫాన్‌లు, వర్షాల ముందస్తు చర్యల ముసుగులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన దర్పాన్ని చూపించారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. తుఫాన్‌కు సంబంధించి అయితే కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించాలే కానీ ఇలా పార్టీ కార్యాలయంలో అధికారిక సమావేశం నిర్వహించడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సమీక్షలో ఒంగోలు నగర టీడీపీ నాయకులు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు, కూటమికి చెందిన జనసేన, బీజేపీ నాయకులు కూడా పాల్గొనటం ఎంతవరకు సబబు అని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

ఇసుక తవ్వకాలకు పోలీసుల అనుమతా?

- అనుమతి ఇవ్వాల్సింది గనులశాఖ
- మాకు తెలియదంటున్న రెవెన్యూ అధికారులు
- సిమెంటు రోడ్డు నిర్మాణం పేరుతో ఇసుక రవాణా
- ఉదయం ఆరు గంటల నుంచే ట్రాక్టర్ల ద్వారా తరలింపు
- ఎంపిక చేసిన ట్రాక్టర్ల ద్వారా రవాణా
- అనుమతులు ఉన్నాయంటూ పోలీసులు వత్తాసు




సింగరాయకొండ-టంగుటూరు ఫ్లై ఓవర్ కిందగా ట్రాక్టరు ఊర్లోకి పోతున్న దృశ్యం

జరుగుమల్లి (సింగరాయకొండ): రీచ్‌ల నుంచి ఇసుక తవ్వాలంటే గనులశాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలి. అయితే జరుగుమల్లి మండలంలో మాత్రం రీచ్‌ల్లో తవ్వకాలకు నిబంధనలు తుంగలో తొక్కి పోలీసులు అనుమతులు ఇచ్చేస్తున్నారు. అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తరలించేస్తున్నారు. ఇది మండలంలో వివాదాస్పదంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. జరుగుమల్లి మండలంలోని జరుగుమల్లి, చింతలపాలెం ఇసుక రీచ్‌ల నుంచి బుధవారం ఉదయం 6 గంటల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా ప్రారంభమైంది. రాత్రి 6 గంటల వరకు తరలిస్తూనే ఉన్నారు. జరుగుమల్లి రీచ్ నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా టంగుటూరుకు, చింతలపాలెం రీచ్ నుంచి కొండపి మండలం కె ఉప్పలపాడు, మండలంలోని ఇతర గ్రామాలకు ఇసుక రవాణా సాగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జరుగుమల్లి నుంచి సుమారు 30 ట్రిప్పులు, చింతలపాలెం నుంచి సుమారు 30 ట్రిప్పులు తరలించారు. ఎంపిక చేసిన ట్రాక్టర్లలో మాత్రమే ఈ అక్రమ రవాణా జరిగిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ఒక్క ట్రాక్టరు కూడా ఇసుక రవాణా చేయలేదని బుకాయించారు. ఎస్సై పున్నారావు మాత్రం టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెం సిమెంట్ రోడ్ల నిర్మాణానికి 20 యూనిట్ల ఇసుక కావాలని పంచాయతీ సెక్రటరీ కోరారని తెలిపారు. పలానా ట్రాక్టర్ల ద్వారా ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు రవాణా చేసుకుంటామని రెవెన్యూ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా అందజేశారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి కోరిక మేరకు ఆ నాలుగు ట్రాక్టర్లలో కాకుటూరివారిపాలెంకు ఇసుక రవాణా చేశారని తెలిపారు. వాస్తవానికి పంచాయతీ కార్యదర్శి లెటరు మీద ఏవిధంగా రవాణాకు అనుమతి ఇస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తహశీల్దార్ బీ జనార్దన్ మాత్రం తనను గ్రామ కార్యదర్శి ఎవరూ ఇసుక కావాలని కోరలేదని వారం రోజుల క్రితం కాకుటూరివారిపాలెం గ్రామస్తులు వచ్చి ఇసుకకు అనుమతి కావాలని కోరితే కుదరదని చెప్పామన్నారు. వాస్తవానికి ఇసుక అనుమతులు ఇవ్వాల్సింది మైనింగ్ శాఖ అని, మాకు ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చే అధికారం లేదని స్పష్టం చేశారు. ఎస్‌ఐ చెబుతున్నట్టుగా పంచాయతీ కార్యదర్శి 20 యూనిట్ల ఇసుకకు అనుమతి అడిగారంటున్నారు. అదీ మూడు రోజులు పాటు తరలించుకుంటామని కోరారని చెబుతున్నారు. అయితే బుధవారం ఒక్కరోజే జరుగుమల్లి, చింతలపాలెం ఇసుక రీచ్‌ల నుంచి దాదాపు 60 ట్రిప్పుల ద్వారా ఇసుకను యథేచ్ఛగా తరలించేశారు. ఎస్‌ఐ చెప్పినట్టు సదరు కార్యదర్శి ఇసుక అడిగింది కాకుటూరువారిపాలెం. అయితే వెళ్లిన ట్రాక్టర్లలో ఎక్కువ శాతం టంగుటూరులోని బొమ్మల సెంటర్ సమీపానికి సరఫరా చేశారని, ట్రాక్టరు ఇసుక రూ.3500లకు విక్రయించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు అక్రమ రవాణాకు ఊతం ఇవ్వటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ హెచ్చరిస్తున్నా కింది స్థాయిలో ఇలా వ్యవహరించడం ఎంత వరకు సబబని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

ఆటోలు సీజ్ చేస్తాం

- నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్న ఎస్పీ ఏఆర్ దామోదర్



డ్రైవర్లు, ఆటో యజమానుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్



రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది, ఆటో డ్రైవర్లు

ఒంగోలు టౌన్: ఆటో డ్రైవర్లు మహిళలు, పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ప్రయాణికులను ఇబ్బంది పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు పాటించకుంటే ఆటోలను సీజ్ చేస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. బుధవారం పోలీసు కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లు, యజమానులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సుదీర్ఘంగా కొనసాగిన ఈ సదస్సులో ట్రాఫిక్ సమస్యలపై ఆటో డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల సమస్యల గురించి వాకబు చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమంపై, కొత్త వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు, యజమానుల సందేహాలకు సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు వృత్తిని గౌరవంగా నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ నిబంధనలను సమగ్రంగా అధ్యయనం చేయాలని, నిబంధనల మేరకు నడుచుకుంటే రహదారి ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు. ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను, రోడ్డు ట్రాఫిక్ సింబల్స్‌ను పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ పత్రం అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, అతివేగంగా వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి ఇతర వాహనాలకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించవద్దని చెప్పారు. అసాంఘిక వ్యక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై అనుమానం వస్తే వెంటనే 112, 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమ నిబంధనలపై ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ అవగాహన సదస్సులో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, తాలుకా సీఐ అజయ్ కుమార్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఆర్‌ఐలు రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.359

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర బుధవారం గరిష్టంగా కేజీ రూ.359 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 11,174 బేళ్లు రాగా 9897 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 1817 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 148వ రోజు వేలం పాటలో 6324 బేళ్లు రాగా 5,513 వ్యాపారులు కొనుగోలు చేశారు. 811 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్టంగా రూ.190, సరాసరి రూ.310.91 వచ్చింది. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 142వ రోజు వేలం పాటలో 5,390 బేళ్లు రాగా 4,384 బేళ్లు కొనుగోలయ్యాయి. 1,006 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.183, సరాసరి రూ.274.79 పలికింది.

గిట్టుబాటు ధర కోసం ఐక్యంగా నిలబడదాం



సమావేశంలో పాల్గొన్న గ్రానైట్ అసోసియేషన్ నాయకులు

చీమకుర్తి: గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులంతా కలిసికట్టుగా గిట్టుబాటు ధర కోసం ఐక్యంగా నిలబడదామని ఆయా ఫ్యాక్టరీల సంఘం నాయకులు ఒక్కటయ్యారు. చీమకుర్తి, బూదవాడ, మర్రిచెట్లపాలెం, ఏలూరు రోడ్డు ప్రాంతాలకు చెందిన నాలుగు ప్రధాన గ్రానైట్ ఫ్యాక్టరీల సంఘాల ప్రతినిధులతో పాటు ఆయా సంఘాల పరిధిలోని ఫ్యాక్టరీల యజమానులు బుధవారం రామతీర్థంలోని వీటీసీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. గిట్టుబాటు ధర కోసం బయ్యర్లను కలిసి మరో సమావేశంలో ఫ్యాక్టరీలు మనుగడ సాగించాలంటే గిట్టుబాటు ధర ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేద్దామన్నారు. దాంతో పాటు గిట్టుబాటు ధరను దెబ్బతీస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీల వద్దనున్న వేస్ట్ పీస్‌లను ఎడ్జ్ కటింగ్ ఫ్యాక్టరీలకు ఇవ్వకూడదని తీర్మానించారు. వేస్ట్ పీస్‌లను కూడా గ్రానైట్ ఫ్యాక్టరీలలోనే కట్ చేసుకోవాలని ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దాంతో పాటు ఫ్యాక్టరీలలోని మెటీరియల్‌కు డిమాండ్ పెరగాలంటే ప్రతి ఆదివారం ఫ్యాక్టరీలు నడపటం ఆపివేయాలన్నారు. అసోసియేషన్ల ప్రతినిధులు నిర్ణయించిన తీర్మానాలను సంఘాల పరిధిలోనున్న ఫ్యాక్టరీల యజమానులంతా తప్పనిసరిగా పాటించాలని డిమాండ్ చేశారు. నాలుగు అసోసియేషన్ల సమావేశానికి యర్రగుంట్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో చీమకుర్తి ఫ్యాక్టరీల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాట్రగడ్డ రమణయ్య, నూకల సురేంద్ర, బూదవాడ అసోసియేషన్ నుంచి లగడపాటి శ్రీను, మేదరమెట్ల భీమన్న, ఆర్.ఎల్.పురం నుంచి మల్లినేని వెంకటేశ్వర్లు, ఏలూరు రోడ్డు అసోసియేషన్ నుంచి ఎన్‌వీ.సుబ్బారావు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు గురు పూజోత్సవం

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉత్తమ గురువులకు సత్కారం
- ఉత్తమ గురువులు వీరే

ఒంగోలు సెంట్రల్: గురుపూజోత్సవం సందర్భంగా గురువారం ఉత్తమ గురువుల సన్మానం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర తెలిపారు. జిల్లాలో 62 మందిని ఉత్తమ గురువులుగా ఎంపిక చేశారని, వీరికి గురువారం ప్రత్యేక సన్మానం చేయనున్నట్లు చెప్పారు. అందులో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, పీజీటీలు, ఎస్‌జీటీలు, ఎస్‌జీటీ (ఉర్దూ) ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లాలో ఉత్తమ గురువులు వీరే...

ప్రధానోపాధ్యాయులు: టీఎల్‌కే కాంతారావు హెచ్‌ఎం (బండ్లమూడి), ఎం.సుధాకర్ (తర్లుపాడు), డీ గురుస్వామి (అల్లీనగరం), డీ జయవరప్రసాద్ (పిడికిటివారి పల్లె, వై పాలెం మండలం), జీ గురు ప్రసాద్ (చందలూరు), టీ బిచ్చాలు గార్లపేట), వై శ్రీనివాసరావు (మహ్మదాపురం), కె.శ్రీనివాస్ (మూలగుంట పాడు), షేక్ అహ్మద్ (వైడీ పాడు), ఎన్ గోపాల్ నాయక్ (కాకర్ల, అర్ధవీడు మండలం) ఉన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌లు (ఎస్‌ఏ): కే నరసింహారావు (దొనకొండ), కే ప్రదీప్ కుమార్ (గజ్జల కొండ), షేక్ ఖాజా హుస్సేన్ (దిరిశ వంచ), కే సత్యనారాయణ (వై.పాలెం), బి.రాధాకృష్ణమూర్తి (ఆకివీడు), వీ మాలకొండయ్య (దొనకొండ), ఎన్ వెంకట రామయ్య (శీలంవారిపల్లె), ఆర్ కొండానాయక్ (ముటుకుల), డాక్టర్ పీ రామాంజనేయులు (ఈతముక్కల), బీ ఆంజనేయులు (మాచవరం), టీ రామారావు (కేకే మిట్ల), పీసీ వెంకటేశ్వర్లు (ఓబులక్కపల్లి), జి. ఈశ్వరమ్మ (పీసీపల్లి), కే సుజాత (అల్లీ నగరం), పీ రాచయ్య (ముక్తినూతలపాడు), టీ రతన్ బాబు (చినారికట్ల), టీ పద్మా గాయత్రి (నాగంపల్లి), పీ రాహేలమ్మ (మీర్జాపేట్, తర్లుపాడు మండలం), పీఎంకే ఆత్రేయ (చిలకపాడు), ఎం రవీంద్ర ప్రసాద్ (డైట్ లెక్చరర్) ఉన్నారు.

పీజీటీలు: వీ శ్రీనివాసరావు (నిడమనూరు), పీ మెర్సిన్ బాబు (కరువది), సీహెచ్ మార్కండేయులు (కొణిజేడు), ఎం శర్మ (మైనంపాడు) ఉన్నారు.

ఎస్‌జీటీలు: కే వెంకటేశ్వర రావు (పీఎస్ కాలనీ, మార్కాపురం మండలం), కే శ్రీనివాసులు (జీసీ, దోర్నాల మండలం), బీ శైలజ (చౌటపల్లి), కేవీ శివ నాగమణి (కురిచేడు ఉర్దూ), సీహెచ్ సునీతా దేవి (సిద్ధవరం, ఏఏ), బి శ్రీదేవి (మంగమూరు), ఎం భాస్కర్ (అయ్యంబొట్లపల్లి), డీ అరుణ (అనుమాలపల్లి), కే మాల్యాద్రి (చిన్నపాడు, పొన్నలూరు మండలం), ఆర్ తిరపతయ్య (గన్నవరం), బీ శ్రీనివాస రెడ్డి (ఊళ్లపాలెం), ఈ సరోజనమ్మ (దర్శి గుంట్ల), సీహెచ్ భాస్కర్ రావు (తురుమెళ్ల), జీ రత్నమ్మ (డీజీ పేట), ఎ పిచ్చమ్మ (మిట్టపాలెం), షేక్ దస్తగిరి (పల్లూరివారి పాలెం), ఎం నరసారెడ్డి (పునుగోడు), పీ సముద్ర కుమారి (అయ్యపరాజు పాలెం), జీ సువార్త (రాచవారి పాలెం), కే శివ పార్వతి (పీహెచ్ కాలనీ, ఒంగోలు), జి రామతులసి (పీ తక్కెళ్ల పాడు), ఎం రజనీ (నందనవనం, జరుగుమల్లి మండలం) ఉన్నారు.

ఎస్‌జీటీ (ఉర్దూ): షేక్ మాలిక (ఫిరోదోస్ నగర్, పొదిలి), సయ్యద్ యాస్మిన్‌భాను (రావిపాడు, కంభం మండలం), పఠాన్ జాన్‌బి (కనిగిరి, 3వ వార్డు) ఉన్నారు.